

నేడు, రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని మల్లేశ్వరం నూతన 33/11 కెవి.విద్యుత్ ఉప కేంద్రం ఇంటర్ లింక్ పనుల్లో భాగంగా రెండు రోజులు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వీరభద్రరావు ఎలక్ట్రికల్ ఎఇ డేవిడ్ నిశ్చల్ తెలిపారు. 10వ తేదీ నుంచి 11 తేదీ వరకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఖండవల్లి, నల్లాకులవారిపాలెం, అన్నవరప్పాడు, పిట్టల వేమవరం పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. వ్యవసాయ విద్యుత్ సమయం ఉదయం 4 గంటల నుండి 7 వరకు, మధ్యాహ్నం 1 గంట నుండి సాయంత్రం 6 గంటల వరకు సరఫరాలో మార్పు చేసినట్టు విద్యుత్ అధికారులు తెలిపారు.

బడి బస్సు భద్రమేనా..?

- త్వరలో విద్యాసంస్థల పునఃప్రారంభం
- జిల్లాలో 700లకు పైగా పాఠశాలల బస్సులు
- అంతంత మాత్రంగానే ఫిట్‌నెట్ పరీక్షలు



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పాఠశాలల ప్రారంభం సమీపిస్తున్న వేళ బడి బస్సులు భద్రమేనా..? అనే ప్రశ్న తలెత్తుతోంది. మరో వారం రోజుల్లో బడులు ప్రారంభం కానున్న విషయం విదితమే. ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ప్రకటనలు చేస్తూ తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయి. విద్యార్థులను గ్రామాల నుంచి పిల్లలను పట్టణంలోని పాఠశాలలకు తీసుకొచ్చేందుకు బస్సులు ఏర్పాటు చేస్తున్నాయి. విద్యార్థులను రవాణా చేసినందుకు రవాణా ఛార్జీలను కూడా వసూలు చేస్తున్నారు. విద్యాసంస్థల యజమాన్యాలు రవాణా శాఖ నిబంధనలు పాటించకుండా బస్సులను నడిపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పలుమార్లు విద్యాసంస్థలకు చెందిన బస్సులు ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయి. బస్సు సీట్లకు మించి విద్యార్థులను ఎక్కువగా చేరవేస్తున్నాయి. అయితే బస్సుల ఫిట్‌నెస్‌ను డ్రైవర్ కండీషన్‌ను పట్టించుకోవడం లేదు. ఇలాంటి బస్సులపై దష్టి సారించి పిల్లలకు ఎలాంటి ఆపద ఏర్పడకూడదని ప్రభుత్వం ప్రతీ సంవత్సరం ఫిట్‌నెస్‌కు సంబంధించిన పరీక్షలు చేయాలని నిర్ణయించింది. అందుకుగాను ప్రతి సంవత్సరం బస్సులకు అందించే ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ స్కూల్సు ప్రారంభానికి ముందే ముగిసేట్లుగా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతీ సంవత్సరం అధికారులు బస్సులు ఎంత మేర ఫిట్‌నెస్ ఉన్నాయనే దానిపై తనిఖీలు చేస్తూ విద్యాసంస్థల పునఃప్రారంభం వరకు సర్టిఫికెట్లను జారీ చేస్తుంటారు. అందులో భాగంగా ఈ సంవత్సరం కూడా ఫిట్‌నెస్ చర్యల్లో భాగంగా విద్యాసంస్థల బస్సుల ఫిట్‌నెస్ చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. అయినప్పటికీ జిల్లాలోని పలు విద్యాసంస్థలకు చెందిన బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ చేయించుకోవడానికి ముందుకు రావడం లేదు.

బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి

బడి బస్సులకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ పరీక్షలు తీసుకోవాలి. డ్రైవర్ హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. జిల్లాలో సుమారు 700 బస్సులు ఉన్నాయి. పాఠశాలల ప్రారంభం నాటికి యాజమాన్యాలు తమ బస్సులకు ఫిట్‌నెస్ టెస్టులు చేయించుకోవాలి. లేని పక్షంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాము.

ఎ.కృష్ణారావు, జిల్లా రవాణా శాఖ అధికారి, తూర్పుగోదావరి జిల్లా.

వారం రోజుల్లో పాఠశాలలు ప్రారంభం

తల్లిదండ్రులను ఆకట్టుకునేందుకు పాఠశాల భవనాలకు రంగులు వేస్తూ అడ్మిషన్లు పెంచుకునేందుకు ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. కానీ విద్యార్థులను తరలించే వాహనాల ఫిట్‌నెస్‌పై మాత్రం దష్టి పెట్టడం లేదు. మరో వారం రోజుల్లో పాఠశాలలు ప్రారంభం కావడం అప్పటిలోగా అన్ని బస్సులకు ఫిట్‌నెస్ పరీక్ష పాస్ నిర్వహించడం అంత ఈజీ కాదు. మరోవైపు కొన్ని విద్యాసంస్థల యాజమాన్యాలు ఫిట్‌నెస్ పరీక్ష పాస్ కావడానికి వాహనాలకు తాత్కాలికంగా మరమ్మతు నిర్వహించి మమ అనిపించే ప్రయత్నాలు చేస్తున్నాయి. గతేడాది ఫిట్‌నెస్ పరీక్షలను నిర్వహించాల్సి ఉన్నా ఫిట్‌నెస్ ప్రక్రియ అంతంత మాత్రంగానే ఉంటున్నట్లు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గడువు ముగిసినా విద్యా సంస్థల బస్సులు యథేచ్ఛగా తిరుగుతున్నాయని అధికారులు మాత్రం స్పందించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ సారైనా యాజమాన్యాలు పాఠాలు నేర్చుకుంటాయా.. ధనార్జనే ధ్యేయంగా అర్హతలేని బస్సులకు మెరుగులు దిద్ది దర్జాగా తిప్పుతారా అన్న సందేహాలు విద్యార్థి సంఘ నాయకుల నుంచి వ్యక్తం అవుతున్నాయి.

ఫిట్‌నెస్ పరీక్షలపై నిర్లక్ష్యం

బడి బస్సు ఫిట్‌నెస్ అర్హత సాధించాలంటే అనేక నిబంధనలున్నాయి. కానీ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలకు నీళ్లు వదలుతున్నారన్న ఆరోపణలున్నాయి. పాత బస్సులకు కొత్త రంగులద్ది బస్సులను నడిపిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. రవాణాశాఖ నిర్దేశించిన ప్రమాణాలను యాజమాన్యలు పట్టించుకోవడం లేదని విమర్శలు లేకపోలేదు. జిల్లాలో రవాణాశాఖ అధికారిక లెక్కల ప్రకారం 700లకు పైగా బడి బస్సులున్నాయి. అందులో జిల్లా కేంద్రానికి చుట్టు పక్కల ఉన్న మండలాల్లోనే ఎక్కువగా పాఠశాలలు ఉండడం ఫిట్‌నెస్ పరీక్షలు చేయించకుండా గడువు చివరి వరకు వేచి ఉండి హడావుడిగా ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాలని చూస్తున్నట్లు సమాచారం. అందుకు ఉదాహరణనే ఆర్‌టిఎ కార్యాలయంలో నమోదైన ఫిట్‌నెస్ బస్సుల సంఖ్య వివరాలు ఏటా పాఠశాల పునఃప్రారంభం నాటికి ఫిట్‌నెస్ కోసం బస్సులను రవాణా శాఖ కార్యాలయానికి తీసుకెళ్తున్నా విద్యా సంస్థల నిర్వాహకులు వారికి సంబంధించిన ఏజెంట్ల ద్వారానే బడిబస్సును ఫిట్‌నెస్‌కు తీసుకె ళ్తున్నారనే విమర్శలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఉంటేనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు అందిస్తామని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు.

ప్రమాణాలపై అనుమానాలెన్నో..

బడి బస్సుల ప్రమాణాలపై ప్రతి ఏడాది లాగానే.. ఎన్నో అనుమనాలు వ్యక్తమవుతున్నాయి. యాజమాన్యాలు ఫిట్‌నెస్ ప్రమాణాలు పాటిస్తున్నాయా.. లేదా.. ఒకవేళ ఫిట్‌నెస్ లేకపోయినా అధికారులు చూసీచూడనట్లుగా వదిలేసి వాటికి గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నారా...? అనే ప్రశ్నలు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘ నాయకుల నుంచి ఉత్పన్నమవుతున్నాయి. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు సరిగా లేని బస్సులకు చిన్న చిన్న మరమ్మతులు చేసి రంగులు వేసి తాత్కాలిక ఏర్పాట్లు చేసి ఫిట్‌నెస్ పరీక్షలకు పంపుతున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరో వారం రోజుల్లో కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటి వరకు ఫిట్‌నెస్ పరీక్షలపై పూర్తి స్థాయిలో దష్టి సారించని అధికారులు హడావుడిగా ఆ ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉందని, తద్వారా ఈ పరీక్షలు తూతూ మంత్రంగా సాగుతాయని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికే పలుచోట్ల బస్సులు ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో వాటి ప్రమాణాలపై అధికారులు పకడ్బందీగా వ్యవహరించాల్సిందేనని తల్లిదండ్రులు స్పష్టం చేస్తున్నారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో విద్యా సంస్థ అధినేత తిరుమలరావు

జెఇఇ ఫలితాల్లో తిరుమల ప్రభంజనం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రతిష్టాత్మక జెఇఇ అడ్వాన్స్ పరీక్షలో రాజమహేంద్రవరంలోని తమ తిరుమల ఐఐటి అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు 385 మంది ర్యాంకులు సాధించారని తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. వివిధ కేటగిరీల్లో జాతీయ స్థాయిలో తమ విద్యార్థులు జి.ఎన్. వెంకట దుర్గ సాయి 53వ ర్యాంకు, కె.సాకేత్ ప్రణవ్ 92వ ర్యాంకు, జి.సత్యనారాయణ 114వ ర్యాంకు, బి.హేమంత్ 123వ ర్యాంకు, ఎన్.నిషాంత్ 126వ ర్యాంకు, ఆర్.పవిత్ర 129వ ర్యాంకు, ఎం.వినేష్ కుమార్ 133వ ర్యాంకు, ఎంజి.వెంకట మహేష్ 136వ ర్యాంకు, ఎం.చరణ్‌శ్రీ తేజ 157వ ర్యాంకు, ఎన్.హార్దిక్ 217వ ర్యాంకు, జి.చంద్ర ప్రకాష్ 225వ ర్యాంకు, ఎం.శ్రీమణికంఠ 235వ ర్యాంకు, టి.ఆదిత్య 236వ ర్యాంకు, సిహెచ్.ధనుంజయ 276వ ర్యాంకు, పి.సాయి అమత్ 291వ ర్యాంకు సాధించడంతో పాటుగా 342, 352, 372, 391, 407, 424, 427, 440, 476 ర్యాంకులు, వెయ్యి లోపు 549 మంది, 3000 లోపు 163 మంది, 5000 లోపు 256 మంది, 10000 లోపు 334 మంది ర్యాంకులు సాధించారని తెలిపారు. 180 మంది పైన విద్యార్థులు ఐఐటిలో సీట్లు సాధించగలరని ఆయన తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపల్ వి.శ్రీహరి అభినందించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-తాళ్లపూడి

చిన్ననాటి స్నేహాన్ని మరిచిపోకుండా తరచూ ఆనాటి బాల్యమిత్రులు నేటి సమాజంలో కలుసుకుంటూ అప్పటి మధురస్మతులను చెప్పుకుంటుంటే ఆ ఆనందం మాటలతో చెప్పలేనిదని పలువురు పూర్వ విద్యార్థులు అన్నారు. తాళ్లపూడిలో పరస పద్మజారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-99 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆదివారం సిల్వర్ జూబ్లీ వేడుక జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ అపూర్వ సమ్మేళనంలో ఉపాధ్యాయులు సుబ్బారావు, ఆంజనేయులు, విశ్వనాథం, శ్రీను విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాపిరాజు

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-గోపాలపురం

రాష్ట్రంలో సంక్షేమం అభివద్దే ధ్యేయంగా టిడిపి ప్రభుత్వం పనిచేస్తుందని జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు అన్నారు. ఆదివారం మండలంలోని పెద్దాపురంలో తెలుగుదేశం పార్టీ నాయకుల, కొర్లపాటి అన్నవరం ఆధ్వర్యంలో ఎన్‌డిఎ కూటమి విజయానికి సహకరించిన నాయకులకు కార్యకర్తలకు ఆత్మీయ మహాసభలో ఆయన మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్రంలో, ఎన్‌డిఎ కూటమికి, నియోజకవర్గంలో విజయానికి కృషి చేసిన ప్రజలందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలో జనసేన పార్టీ బిజెపి తెలుగుదేశం పార్టీ కలయికలో సుమారు 27 వేల ఓట్ల మెజార్టీతో మద్దిపాటి వెంకటరాజును గెలిపించినందుకు మనస్ఫూర్తిగా ప్రత్యేక అభినందనలు తెలిపారు. గోపాలపురం మండలంలో ఎప్పుడూ లేని విధంగా తెలుగుదేశం పార్టీకి 4,400 ఓట్లు మెజార్టీని ఇచ్చి గెలిపించినందుకు గోపాలపురం నియోజకవర్గాన్ని ఎంఎల్‌ఎ మద్దిపాటి. వెంకటరాజు, రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యులు దగ్గుబాటి పురందరేశ్వరి సహకారంతో జిల్లాలో మోడల్ నియోజకవర్గంగా అభివద్ధి చేసే విధంగా కృషి చేస్తామన్నారు. కులమత ప్రాంతీయ విభేదాలు లేకుండా ప్రతి పేదవానికీ సంక్షేమ పథకాలు అందించే విధంగా కృషి చేస్తామన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా అధికార మదంతో అధికారులు, నాయకులు నియోజకవర్గంలో, జిల్లాలో ఎక్కడైనా తెలుగుదేశం పార్టీ నాయకుల, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి వేధించిన వారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నిస్వార్థంగా ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వచ్చేందుకు విస్తత ప్రచారం చేసి అఖండ మెజార్టీకి కృషి చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణ రాజు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, గద్దే హరిబాబు, కొర్లపాటి అన్నవరం, పిన్నమనేని దత్తాత్రేయుడు, ఇల్లూరి రాంబాబు, గన్నమని చిట్టిబాబు, పద్మ సాయి ఫైనాన్స్ టి.సత్యనారాయణ, గన్నిన రామానాయుడు, తానేటి వీరరాఘవులు, బొడ్డు వీరరాఘవులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి నాయకుల విజయోత్సవాలు

టిడిపి కూటమి విజయం సాధించిన నేపథ్యంలో ఆ పార్టీ నాయకులు ఆదివారం విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

తాళ్లపూడి గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజలు టిడిపి, బిజెపి జనసేన కూటమికి ఘన విజయాన్ని అందించారని టిడిపి సీనియర్ నాయకులు నామ శ్రీరాములు అన్నారు. మండలంలోని తాడిపూడిలో ఆదివారం కూటమి నాయకులు విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గ టిడిపి నాయకులు అచ్చిబాబు పిలుపు మేరకు ఎన్నికల ముందు టిడిపి పగ్గాలు చేపట్టిన శ్రీరాములు కుమారుడు నామ కొండబాబు ఆధ్వర్యంలో గ్రామంలో గతం కంటే అధిక మెజార్టీ రావడంతో కార్యకర్తలు నాయకులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. కొండబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో కేక్ కట్ చేసి బాణసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పెరవలి మండలం తీపర్రు గ్రామానికి ఎన్నికల సందర్భంగా ఓటు వేయటానికి జర్మనీ దేశంలో ఉన్న ఎన్నారైలు ముగ్గురు వచ్చి ఓట్లు వేసి తిరిగి వెళ్లారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ఘన విజయం సాధించడం నిడదవోలు నియోజకవర్గం కూటమి అభ్యర్థి కందుల దుర్గేష్ గెలుపొందిన సందర్భంగా తీపర్రు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షుడు కంటిపూడి సూర్యనారాయణ కుమార్తె మనవరాలు జర్మనీలో ఉన్న ఎన్నారైలు, తెలుగువారు ఆదివారం విజయోత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

నల్లజర్ల మండలంలో చోడవరంలో గడిచిన ఎన్నికలలో కూటమి అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజుమెజారిటీ ఓట్లు సాధించడంతో కూటమి శ్రేణులు ఆదివారం సంబరాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ముందుగా వినాయకుని ఆలయ వద్ద కొబ్బరికాయ కొట్టి పాదయాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెండ్యాల చందు, ఉండవల్లి బ్రహ్మయ్య మాట్లాడుతూ మాజీ మంత్రి తానేటి వనితపై మద్దిపాటి వెంకటరాజు 27 వేల ఓట్లతో గెలవడం వెనుక ప్రజలుకోరుకున్న మార్పు, ఓటుతో ఆ ప్రభుత్వానికి ఇచ్చిన తీర్పు అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన అనంతరం పేదలందరికీ న్యాయమైన పరిపాలనను అందజేస్తామని ఆయన అన్నారు. విజయాన్ని చేకూర్చిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెండ్యాల హిమబిందు, ఆలపాటి సుబ్బారావు, రామేశ్వరం, ఉండవల్లి గోపి పాల్గొన్నారు.



తాళ్లపూడిలో టిడిపి నాయకుల సంబరాలు




నల్లజర్లలో విజయోత్సవాలు నిర్వహిస్తున్న మహిళలు



జర్మనీలో విజయోత్సవాలు నిర్వహిస్తున్న పెరవలి మండలం తీపర్రుకు చెందిన ఎన్నారైలు

కార్టూ'నిజం'



జయంతి విద్యా నికేతన్‌లో నాణ్యమైన విద్య



ప్రజాశక్తి-చాగల్లు

గ్రామీణ ప్రాంతంలో బాలబాలికలకు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్టు జయంత్రి విద్యా నికేతన్ స్కూల్ డైరెక్టర్స్ వి.వెంకట్రావు, పద్మావతి తెలిపారు. తమ సుదీర్ఘ ప్రయాణంలో దిగ్విజయంగా స్కూలును నడుపుతూ పట్టణ ప్రాంత విద్యా సంస్థలకు ధీటుగా అద్భుత ఫలితాలను సాధిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నట్టు తెలిపారు. ఇక్కడ చదివిన విద్యార్థులు ఎంతోమంది ఉన్నత స్థానాల్లో ఉండడం గర్వించదగ్గ విషయం అన్నారు. విద్యార్థులకు కేవలం బోధనకే పరిమితం కాక కంప్యూటర్, డాన్స్, కరాటే, గేమ్స్ డిజిటల్ క్లాసుల ద్వారా నూతన విద్యా విధానంలో చేరే విధంగా విద్యను అందిస్తున్నట్టు తెలిపారు. ప్రతి సంవత్సరం 10వ తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధిస్తున్నట్టు తెలిపారు.



విద్యా నికేతన్‌లో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు

విద్యానికేతన్ ప్రత్యేకతలు

- సాధారణ ఫీజులతో కార్పోరేట్ స్థాయి విద్య
- మారుతున్న కాలానికి అనుగుణంగా బోధన
- విశాలమైన ఆటస్థలం
- కరాటే, డాన్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ
- వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- స్పోకెన్ ఇంగ్లీష్‌లో ప్రత్యేక శిక్షణ
- ఐఐటి, పోలిసెట్, ఎపిఆర్‌జెసికి శిక్షణ విద్యార్థులకు బస్సు సౌకర్యం



డైరెక్టర్లు వి.వెంకట్రావు, పద్మావతి

లీలా సంతోషికి రోటరీ క్లబ్ స్కాలర్‌షిప్

ప్రజాశక్తి-గోపాలపురం

రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ స్కాలర్షిప్‌ను కొవ్వూరుపాడు విద్యార్థిని గెలుపొందినట్టు హైస్కూల్ ఇన్‌ఛార్జి హెచ్‌ఎం డి.శేషారత్నం అభినందించారు. ఆదివారం ప్రధానోపాధ్యాయులు శేషరత్నం మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ నిర్వహించిన ఆక్టివిటీ సెలబ్రేషన్‌లో మే నెల 17, 18, 19 తేదీలలో పోటీలు నిర్వహించారని తెలిపారు. ఈ పోటీలకు మండలంలోని కొవ్వూరుపాడు హైస్కూల్‌లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థిని కనుమూరి లీలా సంతోషి పాల్గొన్నట్లు తెలిపారు. మూడు రోజులపాటు నిర్వహించిన పోటీల్లో వ్యాసరచన పోటీల్లో రకరకాల సామాజిక మాధ్యమాలలో మీరు కోరే మార్పులు అనే అంశంలో ద్వితీయ స్థానం సాధించినట్టు తెలిపరాఉ. వ్యక్తిత్వం పోటీల్లో క్షీణిస్తున్న విలువలు ప్రసార మాధ్యమాల్లో మనం కోరే మార్పులు అనే అంశంలో ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. స్పాట్ స్పీకింగ్‌లో సమాచారానికి విజ్ఞానానికి తేడా గమనించారా అనే అంశంలో ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. అందుకుగాను ఎంపికైన విద్యార్థులకు ఎకెసి రోటరీ రివర్ సిటీ హాల్ జెఎన్ రోడ్డు రాజమహేంద్రవరంలో బహుమతులు ప్రదానం చేసినట్లు తెలిపారు. మూడు రోజులు పాటు జరిగిన వ్యాసరచన, వక్తృత్వం, స్పాట్ స్పీకింగ్ ఎంపికైన లీలా సంతోషికి మూడు సర్టిఫికెట్లు, 3 మెడల్స్, స్వామి వివేకానంద జీవిత విశేషాల పుస్తకాలు అందజేసి, ప్రత్యేక బహుమతిగా మూడు బహుమతులు అందుకున్నట్టు తెలిపార. ఆమె ఉన్నత చదువుల కోసం రూ.25 వేలఃను క్లబ్ ద్వారా స్కార్‌షిప్ అందజేసినట్లు తెలిపారు. ఈ విద్యార్థిని గైడ్ టీచరు ఇన్చార్జి హెచ్‌ఎం డి. శేషరత్నం, పోటీలలో విద్యార్థినిని గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థినికి చెక్కు అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

నేరాలు ఘోరాలు


సీజ్ చేసిన బియ్యం లారీతో అధికారులు, సిబ్బంది

రేషన్ బియ్యం లారీ పట్టివేత

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడ, ఆలమూరు రోడ్డులో అక్రమంగా పిడిఎస్(రేషన్ బియ్యం) రవాణా చేస్తున్న లారీని విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారులు సంయుక్తంగా ఆదివారం దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ లారీని తనిఖీ చేయగా వాహనంలో 480 బస్తాల్లో సుమారు 23,500 కేజీల పిడిఎస్ బియ్యాన్ని గుర్తించారు. పిడిఎస్ బియ్యంను కాకినాడ నగర పరిధిలోని జగన్నాథపురానికి చెందిన ఎస్.నరసింహమూర్తి లారీలో భీమవరం జిల్లా పాలకోడేరు మండలంలోని శృంగవక్షంకు చెందిన కనక దుర్గా రైస్ ట్రేడర్స్ నుంచి కాకినాడ లవన్ ఇంటర్నేషనల్‌కు రవాణా చేస్తున్నారు. సుమారు రూ.18,69,250 విలువ గల 23,500 కేజీల పిడిఎస్ బియ్యాన్ని, వాహనాన్ని మండల సివిల్ సప్లయ్స్ అధికారులు సీజ్ చేసి 6-ఎ క్రింద కేసు నమోదు చేశారు. అక్రమ రవాణా చేయుచున్న సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు కొరకు స్థానిక పోలీసు స్టేషన్ కు సిఫారసు చేశారు. ఈ సందర్భంగా రీజనల్ విజిలెన్స్ ఎస్‌పి కెవిఎస్‌ఎస్‌వి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ పరిధిలోని మూడు జిల్లాలలో పిడిఎస్ అక్రమ నిల్వలు, అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందన్నారు. ఎవ్వరైనా పిడిఎస్ కొనడం, అమ్మడం చేస్తే సదరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ అధికారులు జగన్నాధరెడ్డి, వలి, కిషోర్, సిఎస్‌డిటి అలీషా, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

46 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని సుంకరపాలెం గ్రామంలో ఎక్సైజ్ చెక్‌పోస్ట్ వద్ద చేసిన తనిఖీల్లో ద్విచక్రవాహనంపై తరలిస్తున్న 46 మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రామస్వామి ఆధ్వర్యంలో ఆదివారం తనిఖీలు నిర్వహిస్తుండగా చొల్లంగి వెంకటరమణ అనే వ్యక్తి ద్విచక్రవాహనాన్ని తనిఖీ చేశారు. దీంతో అతని నుంచి 46 మద్యం సీసాలతోపాటు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని తాళ్ళరేవు స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ రామస్వామి తెలిపారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుల్స్ రాజు, రామకృష్ణ, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

అపస్మారక స్థితిలో ఉన్న మహిళ ఆసుపత్రికి తరలింపు

ప్రజాశక్తి - కరప



పెనుగుదురు గ్రామంలో బస్ స్టాండు సెంటర్‌లో అపస్మారక స్థితిలో ఉన్న మహిళను పోలీసులు కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుర్తు తెలియని మహిళ రావులపాలెం బస్టాండ్‌లో బస్సు ఎక్కి పెనుగుదురు సెంటర్లో బస్సు నుంచి దిగుతూ కింద పడిపోయింది. ఆ బస్సులో ఉన్న వారు చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో తరలించారు. ప్రస్తుత ఆ మహిళ వివరాలు ఏమీ తెలియలేదని, ఫోటో లో ఉన్న ఆమె వివరాలు తెలిస్తే 9440796557 నెం బర్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ టి.రామకృష్ణ కోరారు.

జెసిబి, మూడు ట్రాక్టర్లు సీజ్


ప్రజాశక్తి-గోపాలపురం

ఎటువంటి అనుమతులు లేకుండా చెరువులు, కాలువలోఓల అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపితే చర్యలు తప్పవని ఎస్ఐ కె.సతీష్ కుమార్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని రాంపాలెంలో జల వనరుల శాఖకు చెందిన బాలంకి చెరువులో అక్రమంగా మట్టిని తవ్వి, రవాణా చేస్తున్నట్టు వచ్చిన సమాచారంపై ఒక జెసిబి, మూడు ట్రాక్టర్లను ట్రక్కులతో సహా సీజ్ చేసి పోలీస్ స్టేషన్ తరలించినట్టు ఎస్ఐ సతీష్ కుమార్ తెలిపారు.

ప్రమాణ స్వీకార పూజలో ఎంఎల్ఎ వేగుళ్ల

ప్రజాశక్తి-మండపేట

టిడిపి అధినేత చంద్రబాబు 4వసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారోత్సవానికి సర్వం సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్న కృష్ణా జిల్లా, గన్నవరం మండలం, కేసరపల్లి సభా స్థలిలో రాజానగరం మాజీ ఎంఎల్ఎ పెందుర్తి వెంకటేష్ ఆదివారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మండపేట ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొన్నారు.


దుర్గేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కుందుల సత్యనారాయణ

ఎంఎల్ఎ దుర్గేష్‌ను కలిసిన 'కుందుల'

ప్రజాశక్తి-పెరవలి

నిడదవోలు నియోజకవర్గంలో భారీ మెజారిటీతో ఘన విజయం సాధించిన జనసేన పార్టీ, కూటమి బలపరిచిన అభ్యర్థి, ఎంఎల్ఎ కందుల దుర్గేష్‌ను ఆదివారం టిడిపి సీనియర్ నాయకులు కుందుల వీర వెంకట సత్యనారాయణ అభినందించారు. ఆయన వెంట, నిడదవోలు పట్టణ మాజీ టిడిపి అధ్యక్షుడు గూడపాటి వెంకట్రావు, టిడిపి పోలవరం నియోజకవర్గఅబ్జర్వర్ అనపర్తి వెంకట నారాయణ పాల్గొన్నారు

ఓణీల వేడుకలో ఎంఎల్ఎ దుర్గేష్

ముక్కామల గ్రామంలో వేండ్ర వెంకటేశ్వరరావు మనవరాలు ఓణీల వేడుక ఫంక్షన్‌లో ఎంఎల్ఎ కందుల దుర్గేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నల్ల సురేంద్ర, వీరేష్ బాబు, వేండ్ర బాలాజీ, వేండ్ర వెంకటరమణమూర్తి నాయకులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా అక్రమ లే అవుట్లు

-ప్రభుత్వ ఆదాయానికి గండి
-పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా ప్రయివేటు లే-అవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. పంట పొలాలను ఇళ్ల స్థలాలుగా మార్చాలంటే కన్వర్షన్ తప్పనిసరిగా ఉండాలి. అయితే కన్వర్షన్ జరగకుండానే అడ్డదారుల్లో లే అవుట్లను వేసి విక్రయాలను చేపడుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి పెద్దఎత్తున గండి పడుతోంది. అయినా సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంపై వెనుక ముడుపులే కారణమనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

మండలంలోని పొన్నాడ, మూలపేట, గోర్స, కొమరగిరి, అమీనాబాద్ తదితర గ్రామాల్లో అనుమతి లేని లేఅవుట్లు వెలుస్తున్నాయి. ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకున్నా ఏర్పాటు చేస్తున్న లే అవుట్‌లలో మౌలిక సదుపాయాల పనులు చేపడుతున్నారు. ఈ పనులన్నీ ప్రభుత్వ నిబంధనలకు తిలోదకాలు పలికి జరుగుతున్నాయంటే ఏ స్థాయిలో అధికారులకు అమ్యామ్యాలు అందుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఈ లే అవుట్లకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా? లేవా? అనే దానిపై అవగాహన లేని కొనుగోలుదారులు చేతులు కాలాకా ఆకులు పట్టుకున్నట్లు ఆ లే అవుట్లను కొనుగోలు చేసి విషయం తెలిసిన తరువాత లబోదిబోమంటున్నారు. ప్రభుత్వ అనుమతి లేని లే అవుట్‌లో గృహాలు నిర్మించుకోవాలంటే కొనుగోలుదారులే అదనంగా సొమ్ములు వెచ్చించి బెటర్‌మెంటు చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అక్రమ లేఅవుట్‌లు ఏర్పాటు చేస్తున్నప్పుడు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు వారిపై చర్యలు తీసుకోకుండా రాజకీయ వత్తిళ్లతో వారు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. లే అవుట్‌లో అప్పుచేసి లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన స్థలాల్లో ఇల్లు నిర్మించుకోవాలంటే పంచాయితీకి చెల్లించాల్సిన సొమ్ము చెల్లించాలని అధికారులు మాత్రం ఆదేశాలు జారీ చేస్తున్నారు. మండలంలోని పొన్నాడ, మూలపేటలో ఏర్పాటులో చేసిన అనుమతి లేకుండా అక్రమంగా ఏర్పాటు చేసిన లే అవుట్‌లపై పొన్నాడ గ్రామ కార్యదర్శి వివరణ కోరగా లే అవుట్‌లకు ఏటువంటి అనుమతులు లేవని తెలిపారు. ఇప్పటికే ఏర్పాటు దారులకు నోటీసులు పంపామని, అలాగే వుడా (వైజాగ్ అర్బన్ డెవలప్ అథారిటీస్)కు సమాచారం అందించామన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అక్రమంగా ఏర్పాటు చేస్తున్న లే అవుట్లపై చర్యలు తీసుకుని ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడటంతోపాటు, కొనుగోలుదారులకు అవగాహన కల్పించేలా దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.


పొన్నాడ గ్రామంలో అనుమతి లేకుండా వేస్తున్న లే అవుట్


మూలపేట గ్రామంలో అనుమతి లేకుండా వేస్తున్న లే అవుట్

దిగజారుతున్న పారిశుధ్యం

-పందుల స్వైరవిహారం
-ఆందోళనలో పట్టణ ప్రజలు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండల కేంద్రమైన ఏలేశ్వరం నగర పంచాయతీలో పారిశుధ్యం దిగజారుతోంది. పట్టణంలో ఎక్కడ చూసినా పందులు స్వైర విహారం చేస్తున్నాయి. పందులను రోడ్లపైకి వదిలితే కఠిన చర్యలు తీసుకుంటామన్నా హెచ్చరికలను సంబంధిత పందుల యజమానులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అధికారులు హెచ్చరికలు జారీ చేసినప్పుడు ఒకటి, రెండు రోజులపాటు పందులను కట్టివేస్తున్నారని, తరువాత యథావిధిగా వదిలివేస్తున్నారు. దీంతో పందులు పట్టణంలో స్వైరవిహారం చేస్తున్నాయి. ఈ పందుల వల్ల అంటు వ్యాధులు ప్రభల్లే అవకాశాలు ఉన్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటికితోడు ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోవడం, డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉండటంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. పట్టణంలో నూతన డ్రెయినేజీలు నిర్మాణం చేపట్టకపోవడం పాత డ్రెయినేజ్‌లు శిధిలావ్యవస్థకు చేరడంతో వర్షాలు పడితే నీరు ఎక్కడపడితే అక్కడే నిలిచిపోయే పరిస్థితులు నెలకున్నాయి. రానున్న వర్షాకాలంలో మలేరియా, టైఫాయిడ్, డెంగూ, వంటి అంటు వ్యాధులు ప్రభలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. నగర పంచాయతీ అధికారులు ఇప్పటికైనా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అలాగే పందులు పట్టణంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


పేరుకుపోయిన చెత్తలో పందులు


ఆత్రేయపురంలో పనులు చేస్తున్న వేతనదారులు

ఉపాధి పనులకు అధికారుల పర్యవేక్షణ కరువు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా చేస్తున్న పనులను క్షేత్ర స్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేకుండా పోయింది. ఎపిఒ భారతి పనులు చేసే సమయంలో పర్యవేక్షించిన దాఖలాలు ఎక్కడా లేవని వేతనదారులే చెబుతున్నారు. పనులు చేసే సమయంలో వారికి కల్పించవలసిన కనీస సౌకర్యాలు కూడా కల్పించకపోగా వారి ఇబ్బందులు చెప్పుకోవాలంటే వినే నాధుడే కురువయ్యాడని వేతనదారులు చెబుతున్నారు. ఒకపక్క కొలతల ప్రకారం పనులు సక్రమంగా చేస్తున్న పూర్తి వేతనం రావట్లేదు అంటూ వేతన్దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . వేసవి దష్ట్యా వారికి కల్పించవలసిన కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంతో వేతనదారులు ఇబ్బందులు వర్ణనాతీతం. వేతనదారులు పనులు చేసే సమయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు తప్ప మరి ఏ అధికారి పనులను పరిశీలించిన దాఖలాలు లేవు.

రూ.250పైబడి వేతనం అందట్లేదు

వేతనదారులు పనులు చేసే సమయంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఎపిఒ, క్లస్టర్ ఎపిడి పనులను పరిశీలించి వారికి పూర్తి వేతనం మూడు వందల ఇరవై రూపాయలు అందేలా చూడాలి. కానీ. రెండు వందల యాభై రూపాయలు పైబడి రావట్లేదు అంటూ వేతనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలగచేసుకుని వేతనదారులకు పూర్తి వేతనం వచ్చేలా పనులు కల్పించాలని పలువురు కోరుకుంటున్నారు.


ఇటీవల కురిసిన వర్షానికి పాశర్లపూడిలో రహదారిపై గోతుల్లో చేరిన మురుగునీరు

ప్రమాదకరంగా రహదారిపై గోతులు

- వాహనచోదకులకు తప్పని ఇబ్బందులు
- మురుగునీరు మళ్లించేలా చర్యలు తీసుకోవాలని వినతి

ప్రజాశక్తి- మామిడికుదురు


మండలంలోని పాశర్లపూడి అమ్మ సూపర్ మార్కెట్ నుండి కైకాల పేట వరకు కిలోమీటర్ వరకు 216వ జాతీయ రహదారి లో నాలుగు చోట్ల ఏర్పడిన గోతులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షానికి గోతుల్లో నీరు చేరడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సఖినేటిపల్లి, మలికిపురం, రాజోలు, మామిడికుదురు మండలాల వాసులే కాకుండా పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు, భీమవరం నుంచి వచ్చే వాహనాల రాకపోకలతో ఈ రహదారిపై గోతులు, మురుగు నీరు నిలువతో అధ్వానంగా మారింది. దీంతో వాహనచోదకులకు అవస్థలు తప్పడంలేదు. ఇదే రహదారిలో మామిడికుదురులో రెండు చోట్ల రోజుల తరబడి మురుగు నీరు తిష్ట వేయడంతో వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు రోడ్డుపై తిష్ట వేసిన మురగనీరు మళ్లించేలా చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

రామోజీరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రముఖ వ్యాపార వేత్త, రామోజీ గ్రూపు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావుకి మృతికి పలువురు సంతాపం తెలిపారు. రామోజీరావు అనారోగ్యంతో ఈ నెల 8న మృతి చెందారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అమలాపురం రూరల్ : రామోజీరావుకి నా చిత్ర నివాళి అంటూ అమలాపురానికి చెందిన చిత్రకారుడు పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్ వాటర్ కలర్స్ ఉపయోగించి ఆదివారం రామోజీ చిత్రాన్ని పెయింటింగ్ వేశారు. ఈ చిత్రం పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ రామోజీరావు స్థాపించిన రామోజీ గ్రూప్ ఆధీనంలో ప్రపంచంలోనే అతిపెద్ద సినిమా స్టూడియో రామోజీ ఫిలిం సిటీ ఉందన్నారు. **కాట్రేనికోన:** రామోజీరావు మృతి రాష్ట్రానికి, మీడియా రంగానికి తీరని లోటు అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు నాగిడి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మృతి తెలుగు ప్రజలకు తీరని లోటని ఆయన అన్నారు. కార్యక్రమంలో కముజు లక్ష్మీ రమణారావు, విత్తనాల బుజ్జి , వాసంశెట్టి రాజేశ్వర రావు, రాష్ట్ర ఎస్‌సి సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సత్తాల ప్రసాద్, మోకా అప్పాజీ, మండల మహిళా అధ్యక్షురాలు మాదే యోగేశ్వరి, ఎం.సత్యనారాయణ మూర్తి తది తరులు పాల్గొన్నారు. **రావులపాలెం:** రామోజీరావు ఆకస్మిక మృతికి చింతిస్తూ ఆదివారం సాయంత్రం స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ భవనం నందు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) ఆధ్వర్యంలోకొత్తపేట నియోజకవర్గ పాత్రికేయులు, నియోజకవర్గ ఎపిడబ్ల్యూజెఎఫ్ కమిటీ సభ్యులు తదితరులు రాజమోజీరావు చిత్రపటానికి నివాళులార్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పి.బంగారు రాజు ,నియోజకవర్గ అధ్యక్షులు వాకాడ బాబులు, సెక్రటరీ పి.చంటి, ఉపాధ్యక్షులు డి.గనిరాజు, ట్రెజరర్ యు.సురేష్, కార్యవర్గ సభ్యులు కెవివి.సత్యనారాయణ, పి.రాజు, కనికిరెడ్డి, ఎన్.నాని ,ఎన్ శ్రీను, ఎన్ రమేష్ , బి.పెద్దిరాజు, మూర్తి తదితరులు పాల్గొన్నారు. **మామిడికుదురు:** రామోజీరావు మృతి తీరని లోటని పలువురు వక్తలు పేర్కొన్నారు. మామిడికుదురు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రామోజీరావు కి నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలుగు పత్రికా రంగంలో ఎనలేని కృషి చేసి తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొన్న రామోజీరావు మృతి పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నయినాల సత్య దుర్గా ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ అమీర్ హసన్, కోశాధికారి ఏడిద బాలకృష్ణారావు, జాయింట్ సెక్రటరీ గుబ్బల హరిబాబు, సభ్యులు కడియం త్రినాథ స్వామి, తోరం సత్యనారాయణ, ఏడిద లోకేష్, స్థానికులు నయినాల సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.


రామోజీరావు చిత్రపటం


కాట్రేనికోనలో రామోజీ చిత్రపటం వద్ద పలువురు నివాళి

కక్షసాధింపు చర్యలే వైసిపి అజెండా

ప్రజాశక్తి-కొత్తపేట

దాడులు, విధ్వంసం, కక్ష సాధింపు చర్యలు వైసిపి నేతలు అజండా అని టిడిపి అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి విమర్శించారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ బాధ్యత గల ప్రతిపక్షంగా వైసిపి నేతలు సూచనలు చేస్తే టిడిపి స్వీకరిస్తుందన్నారు. గత ఐదేళ్లుగా కొత్తపేట నియోజకవర్గంలో జరిగిన పాలనా తీరు భావితరాలకు కనువిప్పు కావాలని వాడపల్లి వెంకన్నఆలయ అభివృద్ధికి శ్రీకారం చుట్టింది, యాత్రికులను ఆకట్టుకునే కార్యక్రమాలు చేపట్టింది బండారు సత్యానందరావు గుర్తు చేశారు. వాడపల్లి ఆలయంలో యాత్రికుల సౌకర్యార్థం అన్నదాన భవనం గాని, కళ్యాణ మండపం కొరకు స్థల సేకరణ చేసింది అప్పటి పాలకవర్గమేనని అన్నారు. బైపాస్ రోడ్డు నిర్మించింది టిడిపి ప్రభుత్వంలో హయాంలోనేని అన్నారు. ఈ ఐదేళ్లలో మీరేం చేశారో అందరికీ తెలిసిన విషయమేనని అన్నారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారంతోపాటు, అభివృద్ధిని ముందుకు తీసుకు వెళ్ళడంలో చంద్రబాబు సారధ్యంలో సత్యానందరావు విజయవంతంగా పని చేస్తారని అన్నారు.

యానాం వార్తలు

బిఎస్‌సి నర్సింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - యానాం

బిఎస్‌సి నర్సింగ్ కోర్సుకు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు నర్సింగ్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం తిరిగి మళ్లీ సెంటాక్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. బిఎస్‌సి కోర్సులో ప్రవేశానికి ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించాల్సి ఉందని, ప్రభుత్వ కోటా అడ్మిషన్ల ప్రక్రియ సెంటాక్ ద్వారా నిర్వహిస్తారన్నారు. కావున అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ నుంచి కొత్తగా తమ దరఖాస్తులను సెంటాక్ వెబ్‌సైట్‌లో పంపాలన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసినవారు సైతం తిరిగి దరఖాస్తు చేసుకోవడం తప్పనిసరన్నారు. ఇందిరా గాంధీ మెడికల్ కాలేజీ, మదర్ థెరిస్సా నర్సింగ్ సెంటర్‌లలో నీట్ మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు.


గుర్తు తెలియని వ్యక్తులు చించేసిన ఫ్లెక్స్

జనసేన ఫ్లెక్సీ చించివేత

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని పాదగయ సమీపంలో జాతీయ రహదారిపై జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ఫొటోలతో కూడిన ఫ్లెక్స్‌ని ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు చించేశారు. దీనిపై జనసేన నాయకులు ఎం.శ్రీను, బి.సాయికుమార్, కె.అరవింద ఫ్లెక్స్ చించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని, ఇటువంటి సంఘటనలు పున రావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎన్‌డిఎ విజయంపై హర్షం

ప్రజాశక్తి - రౌతులపూడి

ఎన్‌డిఎ కూటమి విజయాన్ని హర్షిస్తూ టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. మండలంలోని లచ్చిరెడ్డిపాలెం, పారుపాక గ్రామాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఉమ్మడి వెంకట్రావు, శ్రీను, ఎనుముల రాజా, కోసూరి కృష్ణవర్మ తదితరులు పాల్గొన్నారు.

హింసాత్మక ఘటనలకు స్వస్తి పలకాలి

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

రాష్టంలో హింసాత్మక సంఘటనలకు స్వస్తి పలకాలని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బొంతా శ్యామ్ రవి ప్రకాష్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎన్‌డిఎ కూటమి ప్రమాణస్వీకారం చేయకముందే విధ్వంసాలకు దిగడం అంబేద్కర్ శిలా ఫలకాలను ధ్వంసం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. మహనీయుల విగ్రహాలు స్మృతివనాలు శిలాఫలకాల ధ్వంసం వంటి చర్యలు మానుకోకపోతే తగిన గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు. పేర్లు మార్పు చెయ్యానుకుంటే న్యాయ బద్ధంగా మార్పు చేయవచ్చని, భయానక వాతావరణం సృష్టించి రాష్టంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం మంచి పద్ధతి కాదని తెలిపారు.